Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 02-09-2026

# లేబర్ కార్డు ఉంటే సంక్షేమానికి భరోసా

## - బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తోట సత్తిబాబు



ఇది కద నిజం, కుక్కునూరు: తాపీ కార్మికులు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో సభ్యత్వం నమోదు చేసుకోవాలని, తప్పనిసరిగా లేబర్ కార్డు తీసుకుని సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కుక్కునూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తోట సత్తిబాబు పిలుపునిచ్చారు. కుక్కునూరు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ కార్యవర్గం, సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డులో సభ్యత్వం పొందిన కార్మికులకు ప్రమాద బీమా, జీవిత బీమా, వైద్య సహాయం, కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం, మహిళా కార్మికులకు ప్రసూతి ప్రయోజనాలు, పిల్లల విద్యకు స్కాలర్‌షిప్‌లు, గృహ నిర్మాణ సహాయం, పనిముట్ల పంపిణీ, 60 ఏళ్ల తర్వాత పెన్షన్, వికలాంగులకు పెన్షన్ వంటి పలు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, గత 12 నెలల్లో కనీసం 90 రోజుల పాటు నిర్మాణ పనులు చేసిన కార్మికులు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పని చేసినట్లు ధృవీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో యూనియన్ కార్యాలయంలో సభ్యత్వం నమోదు చేసుకోవచ్చని వివరించారు. ప్రతి సంవత్సరం నిర్ణీత సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలని సూచించారు. కుక్కునూరు మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మహమ్మద్ ఉస్మాన్ పాషా మాట్లాడుతూ.. యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, స్వతంత్రంగా కార్మికుల సమస్యలపై ముందుకు సాగుతుందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు తీసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కర్నాటి కామేశ్వరరావు, కిట్ట వెంకన్న, తోట నరసింహారావు, తోట సత్యనారాయణ, తోట ప్రభాకర్, మహమ్మద్ షాజీద్, షకూర్, లక్ష్మణరావు, తోట నాగరాజు, వెంకటేశ్వరరావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల డిమాండ్లను విస్మరిస్తే ఉద్యమం తప్పదు

## - ఏలూరు జిల్లా సీఐటీయూ కార్యదర్శి యర్నం సాయికిరణ్




ఇది కద నిజం, కుక్కునూరు: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, శానిటేషన్ కార్మికుల పెండింగ్ వేతనాలు, బిల్లులను వెంటనే చెల్లించి వారి సమస్యలను పరిష్కరించాలని ఏలూరు జిల్లా సీఐటీయూ కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య భవన్ ప్రజా సంఘాల కార్యాలయంలో బాడిస సుజాత అధ్యక్షతన జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు జూన్, జూలై నెలల పెండింగ్ వేతనాలు, బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మెగా పేరెంట్స్ డే సందర్భంగా వండిన భోజనాలకు సంబంధించిన బిల్లులను కూడా తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు, బిల్లులు చెల్లించడంతో పాటు, ప్రస్తుతం ఇస్తున్న అతి తక్కువ వేతనాలను పెంచి కనీస వేతనం అమలు చేయాలని అన్నారు. వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఒక్కో విద్యార్థికి రూ.20 మెనూ ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ కిచెన్ల విధానాన్ని రద్దు చేసి మధ్యాహ్న భోజన కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల పెండింగ్ వేతనాలు, బిల్లులను వెంటనే చెల్లించాలని, వారికి నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ పనులకు అవసరమైన నిధులు, గ్రాంట్లను సకాలంలో విడుదల చేసి, కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజన, శానిటేషన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని యర్నం సాయికిరణ్ హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు పోచవరపు వెంకటేశ్వర్లు, కారం నాగలక్ష్మి, కాకా కమల, ఆర్.వి.రమణ, కారం వందన, కనితి మంగ, పున్నమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా సీఎం సహాయనిధి

## - రూ.2.77 లక్షల చెక్కు అందజేసిన కూటమి నాయకులు



ఇది కద నిజం, కుక్కునూరు: అనారోగ్యంతో బాధపడుతున్న కుక్కునూరు గ్రామానికి చెందిన కుచ్చర్లపాటి సత్యనారాయణ రాజుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరైంది. దానికి సంబధించిన చెక్కును మంగళవారం కుక్కునూరు మండల కూటమి నాయకులు లబ్ధిదారునికి స్వయంగా అందజేశారు. మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం అవసరమవడంతో సత్యనారాయణ రాజు స్థానిక కూటమి నాయకులను సంప్రదించారు. వారి సూచన మేరకు కుటుంబ సభ్యులు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దానిని పరిశీలించిన ముఖ్యమంత్రి కార్యాలయం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2,77,497 మంజూరు చేసింది. దీనికి సంబంధించిన చెక్కును మంగళవారం స్వయంగా అందజేశారు. చెక్కు అందుకున్న అనంతరం లబ్ధిదారుడు సత్యనారాయణ రాజు తనకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో పాటు కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ములిశెట్టి నాగు, జనసేన మండల ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, కూటమి నాయకులు రమణ రాజు, అంగిరేకుల బాలాజీ, నరేంద్ర రాజు, సమయమంతుల లక్ష్మణస్వామి, గరటం రమణ తదితరులు పాల్గొన్నారు.

# రాంలీలా మైదాన్‌లో 'బద్లావ్ జరూరీ హై' మహాధర్నాకు కదిలిన సిపిఐ నేతలు



ఇది కద నిజం, రాజేంద్రనగర్ : దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విపరీతమైన ధరల పెరుగుదల, ప్రజాస్వామ్య హక్కుల హననం మరియు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ చలో డిల్లీ కార్యక్రమం చేపట్టింది. సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదాన్‌లో తలపెట్టిన ప్రతిష్టాత్మక 'బద్లావ్ జరూరీ హై' "మార్పు కావాలి "సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ పల్లా వెంకట్ రెడ్డి గారు ఎమ్మెల్సీ కామ్రేడ్ సత్యం అన్నగారు సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యగారి నర్సింహ్మారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు జే ఆనంద్ గౌడ్ రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె విజయ్ ఆనంద్ గౌడ్ మండల బిసి అధ్యక్షులు జే సదనంద్ గౌడ్ న్యూఢిల్లీ బయలుదేరి వెల్లారు దేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, విద్వేషపూరిత విధానాల వల్ల కార్మికులు, కర్షకులు, యువత, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ, దేశాన్ని సరైన ప్రజాస్వామ్య మార్గంలో నడిపించేందుకు ఈ "బద్లావ్ జరూరీ హై" సభ చారిత్రాత్మక మలుపు కానుందని తెలంగాణ రాష్ట్రం నుండి తరలివెళ్లిన ప్రతినిధి బృందం ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో జరిగే జాతీయ స్థాయి నిరసన ప్రదర్శనలో క్రియాశీలకంగా పాల్గొని, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళం విప్పనుందన్నారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వైఫల్యం

## యూఎస్ఎఫ్ఐ నాయకులు ధ్వజం

ఇది కద నిజం, నంద్యాల:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (USFI) నాయకులు మండిపడ్డారు. నంద్యాల పట్టణంలోని సునీత ఒకేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన జిల్లా ప్రథమ మహాసభలలో USFI రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ముఖ్య ప్రసంగం చేశారు. సంవత్సరాల తరబడి ఫీజు



రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.7,000 కోట్లను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 54 బీసీ వసతి గృహాలను పూర్తిగా మూసివేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని నాయకులు స్పష్టం చేశారు. కేవలం 10 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలను తేవడం కోసం ఇన్ని హాస్టళ్లను మూసివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అలాగే కాలేజీ వసతి గృహాలన్నీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని, వాటికి తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, పాత్రికేయులు వెళ్లకుండా ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్న జీవో నంబర్ 77 (GO No.77) ను తక్షణమే రద్దు చేసి, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరించాలని నేతలు డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినందున హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. అన్నా క్యాంటీన్లు, జైలు ఖైదీల ఆహార బడ్జెట్‌ను పెంచిన ప్రభుత్వం.. హాస్టళ్లలో చదివే పేద విద్యార్థుల మెస్ చార్జీలను ఎందుకు పెంచడం లేదని నిలదీశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయడానికి జీవో నంబర్ 1ని కఠినంగా అమలు చేయాలన్నారు.

జాతీయ స్థాయిలో నీట్, ఇతర పోటీ పరీక్షల నిర్వహణలో వైఫల్యం చెందిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA)పై విద్యార్థులకు నమ్మకం పోయిందని, UGC-NET ప్రశ్నాపత్రాల లీకేజీతో అనేకమంది అభ్యర్థులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చీూా ను రద్దు చేసి, నీట్ వంటి



పరీక్షల బాధ్యతలను తిరిగి రాష్ట్రాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ డీమ్డ్ యూనివర్సిటీలు ప్రత్యేక ప్రవేశ పరీక్షల పేరుతో భారం మోపకుండా, JEE Mains/EAMCET ర్యాంకుల ఆధారంగానే ప్రవేశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలని కోరారు. విద్యార్థుల హక్కుల కోసం దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాసభల్లో USFI జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి సురేంద్రనాయక్, ఆళ్లగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు సంతోష్, బనగానపల్లె అధ్యక్షుడు శివ మరియు విద్యార్థి నాయకులు కార్తీక్, దినేష్, యువరాజ్, మద్దిలేటి, శీను తదితరులు పాల్గొన్నారు.

# పిట్లంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల మంజూరు జరగలేదని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, ఉపసర్పంచ్ అవేజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్‌కుమార్, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, వార్డు సభ్యులు కుమ్మరి అనసూయ, సునీత, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం కార్యక్రమంలో రైతులకు అవగాహన

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని తిమ్మానగర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. యూరియా బుకింగ్‌కు అమలవుతున్న 'ఫార్మర్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్' యాప్ వినియోగంపై వివరించారు. క్షేత్రస్థాయిలో పంటల నమోదు జరుగుతున్నందున సిబ్బంది పొలాలకు వచ్చినప్పుడు సాగు చేసిన పంట వివరాలను తెలియజేయాలని సూచించారు.

సన్న రకం వరి సాగు చేసిన రైతులు బోనస్ కోసం విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ల వద్ద నమోదు చేసుకోవాలని, సొంత విత్తనాలు వినియోగించిన వారు వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సూచించారు. రైతులు ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమానికి హాజరై శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పొందాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినోద్, ఏఈఓ ప్రదీప్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాలు నేరం

## అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

ఇది కద నిజం, ఆంధ్రప్రదేశ్ :మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'బేటీ బచావో – బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిషేధం, బాలికల భద్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్య వివాహాలకు, మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై బాల్య వివాహ రద్దు చట్టం మరియు పోక్సో చట్టాల కింద కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఆపద సమయంలో బాలికలు 1098, 181, 112 నెంబర్లకు డయల్ చేయాలని, రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో 'శక్తి యాప్' డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీమతి హైమావతి, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ కుమార్, సీఐ మహమ్మద్ రఫీ, ఎస్బీ సీఐ యు. సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.



# పెన్షన్ విద్రోహ దినం సందర్బంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన




ఇది కద నిజం తొర్రూరు ,01 సెప్టెంబర్ : రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణా ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, ఉపాధ్యాయులు సరిత, సునిత, సంధ్యారాణి, ప్రవీణ్ కుమార్, శిరీష, యమన, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

